సాక్షి వికారాబాద్

శుక్రవారం । 7 । జూన్ । 2024



సర్కారుబడి సరికొత్త ఒరవడి

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని యాలాల మండల విద్యాధికారి సుధాకర్‌రెడ్డి తెలిపారు. 9లో▸



సొంత భవనాలు కరువు

దౌల్తాబాద్ మండలంలో మహిళా పొదుపు సంఘాలకు సొంత భవనాలు లేక ఇబ్బందులు తప్పడం లేదు. 9లో▸



నిర్మించారు.. వదిలేశారు..

మోమిన్‌పేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి కొత్తగా నిర్మించి భవనం ఆరు నెలలుగా ప్రారంభానికి నోచుకోవడం లేదు. 9లో▸

న్యూస్‌రీల్

రామలింగేశ్వర స్వామి ఆలయంలో స్పీకర్ పూజలు



పూజలో పాల్గొన్న అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్ తదితరులు

అనంతగిరి: వికారాబాద్ పట్టణ పరిధిలోని శ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయంలో గురువారం అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్ ప్రత్యేక పూజలు చేశారు. నవగ్రహ పాశుపత హోమం చేపట్టారు. స్వామివారికి అభిషేకం, అర్చనలు చేసి తీర్థప్రసాదాలు అందుకున్నారు. పూజలో స్పీకర్ కూతురు, కుమారుడు, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి దంపతులు, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, మాజీ చైర్మన్ సత్యనారాయణ, మాజీ వైస్ చైర్మన్ రమేష్‌కుమార్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ కిషన్‌నాయక్, ఏఎంసీ మాజీ చైర్మన్ రాంచంద్రారెడ్డి, కౌన్సిలర్లు మురళి, గాయత్రి, నాయకులు రఘుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్‌-1 ప్రిలిమినరీకి ఏర్పాట్లు పూర్తి

అడిషనల్ కలెక్టర్ రాహుల్‌శర్మ



సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ రాహుల్‌శర్మ

అనంతగిరి: జిల్లాలో గ్రూప్ -1 ప్రిలిమినరీ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అడిషనల్ కలెక్టర్ రాహుల్‌శర్మ తెలిపారు. గురువారం తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ మహేందర్‌రెడ్డి ఉన్నతాధికారులతో కలిసి జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో పరీక్షకు చేసిన ఏర్పాట్లను అడిషనల్ కలెక్టర్ వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 9న నిర్వహించే గ్రూప్‌-1 ప్రిలిమినరీ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామన్నారు. పరీక్ష కేంద్రాల్లో తాగునీటి వసతి, విద్యుత్ సదుపాయం వంటి సదుపాయాలు ఉండేలా చర్యలు చేపట్టినట్లు వివరించారు. పరీక్ష జరిగే సమయంలో బందోస్తు ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. అనంతరం ఎస్పీ కార్యాలయంలో బయోమెట్రిక్‌పై నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో పాల్గొని పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఎస్పీ రవీందర్‌రెడ్డి, ఆర్డీఓ వాసుచంద్ర, టీజీపీఎస్సీ రీజినల్ కోఆర్డినేటర్ రాజేష్, కలెక్టరేట్ పరిపాలన విభాగం అధికారి అమరేందర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి: జంగయ్య

మంచాల: ప్రభుత్వం దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన ప్రత్యేక సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడారు. రేవంత్‌రెడ్డి సర్కార్ వచ్చి ఆరు నెలలు దాటినా దివ్యాంగులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు పర్చడం లేదని విమర్శించారు. ఆసరా పింఛన్లు పెంచుతామని గొప్పలు చెప్పడం తప్ప పట్టించుకున్న పాపాన పోవడం లేదన్నారు. ఇచ్చిన మాట ప్రకారం దివ్యాంగులకు నెలకు రూ.6వేలు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, బీడీ కార్మికులకు నెలకు రూ. 4వేలు పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించిన ప్రభుత్వం దివ్యాంగులకు మాత్రం ప్రకటించకపోవడం శోచనీయమన్నారు. తక్షణమే ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, లేని పక్షంలో ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు.

నకిలీ పత్తి విత్తనాలు స్వాధీనం

కొందుర్గు: పోలీసుల దాడుల్లో 30 కిలోల నకిలీ పత్తి విత్తనాలు పట్టుబడిన సంఘటన కొందుర్గులో వెలుగు చూసింది. ఎస్సై కృష్ణయ్య తెలిపిన వివరాల ప్రకారం.. లూర్దునగర్‌లో నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తున్నారని తెలిసి గురువారం మధ్యాహ్నం లూర్దునగర్‌కు చెందిన సలిమెల్ల లూర్దు రెడ్డి ఇంట్లో సోదాలు నిర్వహించారు. ఓ ప్లాస్టిక్ బస్తాలో ప్రభుత్వం నిషేధించిన (బీటీ 3 విత్తనాలు) లూజ్ విత్తనాలు 30 కిలోలు లభించాయి. ఈ విషయమై లూర్దురెడ్డిని విచారించగా పటాన్‌చెరువుకు చెందిన రాజప్ప రెడ్డి ద్వారా కొనుగోలు చేసి కొందుర్గు పరిసర గ్రామాల రైతులకు విక్రయిస్తున్నట్లు తెలిపాడు. ఈ మేరకు విత్తనాలు సీజ్ చేసి నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.



వికారాబాద్ మండలంలోని ఓ రైస్ మిల్లు వద్ద ధాన్యం లారీలు

తరుగు పేరుతో టోకరా

రైతులను నిండా ముంచుతున్న మిల్లర్లు

- ఒక్కో లారీలో 10 నుంచి 40 బస్తాల వరకు తరుగు తీస్తున్న వైనం
- మిల్లర్లకే కొమ్ముకాస్తున్న అధికారులు
- జిల్లాలో ధాన్యం కొనుగోలు లక్ష్యం 1.20 లక్షల మెట్రిక్ టన్నులు
- ఇప్పటి వరకు కొనుగోలు చేసింది 50,237 మెట్రిక్ టన్నులు

వికారాబాద్: మిల్లర్లు మాయాజాలంతో రైతులు నిండా మునుగుతున్నారు. ఓ సారి కొనుగోలు కేంద్రంలో.. మరో సారి మిల్లర్ల వద్ద తరుగు పేరుతో క్వింటాళ్లకు క్వింటాళ్లు మింగేస్తున్నారు. ఒక్కో లారీకి 10 నుంచి 40 బస్తాల వరకు తరుగు తీస్తున్నారు. మరో పక్క తూకాల్లోనూ వ్యత్యాసం కనిపిస్తోంది. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు తేమ, తాలు శాతం చూసే ధాన్యం సేకరిస్తుండగా తరువాత మిల్లర్లు తరుగు పేరుతో మరోసారి క్వింటాల్‌కు నాలుగు నుంచి ఎనిమిది కిలోల వరకు కోత పెడుతున్నారు. దీంతో చాలా మంది రైతులు ఇష్టం లేకున్నా కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తున్నారు. మరికొంత మంది తక్కువ ధరకే దళారులకు విక్రయిస్తున్నారు. మిల్లర్లు చెప్పిన మేరకు తరుగు తీసేందుకు రైతులు ఒప్పుకోకుంటే తిప్పి పంపుతున్నారు. ఈ విషయం జిల్లా సివిల్ సప్లై అధికారుల వరకు వెళ్లినా ప్రయోజనం ఉండటం లేదు. అధికారులు ఆదేశించినా మిల్లర్లు ససేమిరా అంటున్నారు. చివరకు మిల్లర్లు తమ పంతం నెగ్గించుకుని రైతులను ముంచేస్తున్నారు. పర్యవేక్షించాల్సిన అధికారులు చుట్టపు చూపుగా వచ్చి వెళుతున్నారు. కొన్ని సందర్భాల్లో మిల్లర్లకే కొమ్ముకాస్తున్నారు.

మిల్లర్లతో కుమ్మక్కు

ప్రభుత్వం క్వింటాలు ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2,203 మద్దతు ధర ప్రకటించింది. సాధారణ రకానికి రూ.2,183 ఇస్తోంది. కొనుగోలు కేంద్రాల్లో క్వింటాలుకు సంచి బరువు, తరుగు కలుపుకొని కేజీ 200 గ్రాముల తీయాలనే నిబంధన ఉంది. కానీ ఇది ఎక్కడా అమలు కావడంలేదు. రైస్ మిల్లర్లు తూకం, తరుగు విషయంలో కొర్రీలు పెడుతున్నారు. అధికారులు మిల్లర్లతో కుమ్మక్కై వారు వేసిందే తూకం.. చెప్పిందే ధర అన్నట్లు వ్యవహరిస్తున్నారు. కొన్ని చోట్ల బ్యాగుకు మూడు కిలోల నుంచి ఐదు కిలోల వరకు తరుగు తీస్తున్నారు. మరి కొన్ని చోట్ల మిల్లర్లు ఆరు నుంచి ఎనిమిది కిలోల వరకు తరుగు తీస్తున్నారు. అలా అయితేనే ధాన్యం తీసుకుంటామని, లేదంటే వెనక్కు తీసుకెళ్లాలని తెగేసి చెబుతున్నారు. ఈ విషయం సంబంధిత జిల్లా అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదు.

పలు చోట్ల ఇదే తంతు

వికారాబాద్ మండలం దన్నారం రైస్ మిల్లుకు బుధవారం ధారూరు మండలంలోని నాగసముందర్, పరిగి మండలాల పరిధిలోని మిట్టకోడూర్, దోమ మండలంలోని బాస్పల్లి తదితర కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం లారీల్లో తరలించారు. అక్కడ తూకంలోనూ తేడా వచ్చింది. ఇక్కడ తూకం వేసిన దానికి మిల్లర్ల దగ్గర తూకం వేశాక పది నుంచి 20 బ్యాగుల వరకు తేడా వచ్చింది. ఇది కాకుండా ధాన్యం రంగు మారిందని, ముక్క వాసన వస్తోందని, బియ్యం తీస్తే ఎర్రగా వస్తున్నాయనే కారణాలు చూపిస్తూ ఒక్కో లారీకి 10 నుంచి 40 బస్తాల వరకు కోత విధించారు. ఇలా అయితేనే తీసుకుంటాం లేదంటే వెనక్కు తీసుకెళ్లాలని మిల్లర్లు చెబుతున్నారు. దీంతో చేసేది లేక కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు రైతులను అక్కడికే పిలిపించారు. రైతులు ధాన్యాన్ని తిరిగి తీసుకెళ్లలేక వారు పెట్టిన షరతులకు తలొగ్గి ఒక్క బ్యాగుకు ఆరు కిలోల తరుగు తీసేందుకు ఒప్పుకుని ధాన్యం ఇచ్చేసి వచ్చారు. ఈ విషయం రైతులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు సివిల్ సప్లై జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లగా వారు అక్కడికి చేరుకొని మిల్లర్లకే వంత పాడటం గమనార్హం. మీరూ.. మీరూ మాట్లాడుకోండని అక్కడి నుంచి జారుకోవడంతో చేసేది లేక మిల్లర్లు చెప్పిన తూకానికే వదిలేయటం రైతుల వంతయ్యింది. యాలాల్, అగ్గనూరు. పరిగి తదితర మిల్లులలోనూ ఇదే తరహాలో తాలు, ముక్క వాసన పేరుతో ధాన్యానికి కోత పెట్టి నిండా ముంచారని రైతులు ఆరోపించారు. జిల్లాలో 129 కొనుగోలు కేంద్రాల ద్వారా 50,237 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారు.



నెమలిని కాల్చిన ప్రదేశాన్ని పరిశీలించి వివరాలు సేకరిస్తున్న ఫారెస్ట్ అధికారులు

నెమలిని కాల్చి తినేశారు

- చౌడాపూర్ మండలం పాచావ్‌కుంట తండాలో ఘటన
- కేసు నమోదు.. విచారణ చేపట్టిన ఫారెస్ట్ అధికారులు

కుల్కచర్ల: జాతీయ పక్షి నెమలిని కాల్చుకుని తినేసిన ఘటన చౌడాపూర్ మండలం ఈర్లవాగుతండా అనుబంధ గ్రామమైన పాచావ్‌కుంట తండాలో వెలుగుచూసింది. అటవీశాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. పాచావ్‌కుంటతండాలో బుధవారం విద్యుదాఘాతంతో పడిపోయిన నెమలిని చూసిన గిరిజనులు నీల్యానాయక్, గోబ్ర్యానాయక్ అక్కడే దాని ఈకలు పీకి, కాల్చి ఇంటికి తీసుకెళ్లి తిన్నారు. ఈ విషయమై కొంతమంది తండావాసులు ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించడంతో గురువారం ఘటనా స్థలానికి చేరుకుని ప్రాథమిక విచారణ నిర్వహించారు. అనంతరం ఇరువురిపై వన్యప్రాణి సంరక్షణ చట్టం కింద కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఈ విషయమై సెక్షన్ ఆఫీసర్ ప్రవీణ్ కుమార్‌ను వివరణ కోరగా.. నెమలిని తిన్నారన్న సమాచారం మేరకు తండాకు వెళ్లామని, అక్కడ ఉన్న విద్యుత్ వైర్లు, కాల్చిన ప్రదేశాన్ని గుర్తించి, స్థానికులతో మాట్లాడామని చెప్పారు. ఇద్దరిపైనా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, పూర్తిస్థాయి నిజానిజాలు నిర్ధారించిన తర్వాత అవసరమైన సెక్షన్ల ప్రకారం చట్టరీత్యా చర్యలకు ప్రతిపాదిస్తామని స్పష్టం చేశారు. వీరి వెంట బీట్ ఆఫీసర్ జమాలుద్దీన్ తదితరులు ఉన్నారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయండి

షాద్‌నగర్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అమ్మ ఆదర్శ పాఠశాలల్లో అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు ఆదేశించారు. షాద్‌నగర్ పట్టణంలోని ఎంఆర్‌సీ భవనంలో గురువారం హెచ్‌ఎంలు, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల్లో విద్యార్థులకు కావాల్సిన కనీస మౌలిక సదుపాయాలు కల్పిస్తోందని అన్నారు. పాఠశాలలు ప్రారంభమయ్యేలోపు తాగునీటి సరఫరా, మరుగుదొడ్ల మరమ్మతు పనులు, విద్యుత్ సదుపాయం వంటి అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

పెండింగ్ పనులన్నీ పూర్తవ్వాలి

కలెక్టర్ నారాయణరెడ్డి

అనంతగిరి: జిల్లాలో పెండింగ్‌లో ఉన్న పనులన్నింటినీ సత్వరం పూర్తి చేయాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ నుంచి టెలికాన్ఫరెన్స్ ద్వారా మండలస్థాయి అధికారులతో మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికలు సజావుగా, ప్రశాంతంగా నిర్వహించినందుకు అధికారులందరికీ అభినందనలు తెలిపారు. విధి నిర్వహణలో అలసత్వం వహించరాదని, ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. పెండింగ్ ఫైళ్లను పరిష్కరించాలని ఆదేశించారు. ఇక నుంచి ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం ఉంటుందని, జిల్లా అధికారులు తప్పక హాజరుకావాలన్నారు. పాఠశాలలు, కళాశాలలు పునఃప్రారంభం అవుతున్నందున విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పరిశుభ్రత, తాగునీరు, మరుగుదొడ్లు వంటి సదుపాయాలు కల్పించాలని సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన పనులను యుద్ధ ప్రతిపాదికన పూర్తి చేయాలన్నారు. పనుల పురోగతిపై ఆరా తీశారు. బడిబాట కార్యక్రమం నిర్వహించాలని తెలిపారు. పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాంల తదితర అంశాలపై చర్చించారు. బడీడు పిల్లలు పాఠశాలకు వచ్చేలా అధికారులందరూ సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. స్కూళ్ల ప్రారంభం రోజున పాఠశాలలను అందంగా తీర్చిదిద్దాలని, పుస్తకాలు, యూనిఫామ్స్ పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ సుధీర్, డీఆర్డీఓ శ్రీనివాస్, డీఈఓ రేణుకాదేవి, జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

విత్తన కొరత లేకుండా చూడండి

రైతులకు ఎరువులు, విత్తనాల కొరత లేకుండా చూడాలని కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులకు సూచించారు. గురువారం గ్రూప్‌-1 ప్రిలిమనరీ పరీక్ష, వానాకాలం సీజన్ కార్యాచరణ, మిషన్ భగీరథ, అమ్మ ఆదర్శ పాఠశాలల్లో అభివృద్ధి పనులపై ప్రిన్సిపల్ సెక్రెటరీ శాంతకుమారి జిల్లా కలెక్టర్లలతో సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రైతులకు ఎరువులు, విత్తనాల లభ్యతలో ఎలాంటి ఆటంకం కలగకుండా ప్రతి మండలంలో ఇన్‌చార్జ్ అధికారులను నియమించాలన్నారు. గ్రూప్‌-1 ప్రిలిమినరీ పరీక్షను పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. పాఠశాలల విద్యార్థులకు ఈ నెల 10వ తేదీ లోపు యూనిఫామ్స్ అందజేస్తామని తెలిపారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్లు రాహుల్ శర్మ, లింగ్యానాయక్, డీఈఓ రేణుకాదేవి, జెడ్పీ సీఈఓ సుధీర్, డీఆర్డీఓ శ్రీనివాస్, మిషన్ భగీరథ ఈఈ బాబు శ్రీనివాస్, మెప్మా పీడీ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సదరం స్లాట్ బుకింగ్

జిల్లాలో సదరం క్యాంపునకు సంబంధించి 7వ తేదీ ఉదయం 11గంటల నుంచి మీ-సేవ కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకోవచ్చని కలెక్టర్ నారాయణరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11, 13, 21, 27, 29 తేదీల్లో తాండూరు ప్రభుత్వ ఆస్పత్రిలో నిర్వహించే శిబిరానికి స్లాట్ బుక్ చేసుకున్న అంగవైకల్యం, బుద్ధి మాంద్యం, చెవుడు, మూగ సమస్య ఉన్న వారు హాజరుకావాలన్నారు. అలాగే 10, 11, 18, 26 తేదీల్లో వికారాబాద్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో నిర్వహించే శిబిరానికి అంగవైకల్యం, అంధులు హాజరుకావాలని సూచించారు. గతంలో సదరం సర్టిఫికెట్ పొంది కాలపరిమితి పూర్తయిన వారు కొత్తగా స్లాట్ బుక్ చేసుకోవాలన్నారు. ప్రస్తుతం 590 స్లాట్స్ అందుబాటులో ఉన్నట్లు తెలిపారు.

మహిళా సంఘాల పనితీరు భేష్

కితాబిచ్చిన ఎన్‌ఐఆర్డీ అధికారుల బృందం

మహేశ్వరం: మహిళా సంఘాల పనితీరు బాగుందని ఎన్‌ఐఆర్‌డీ బృందం హర్షం వ్యక్తం చేసింది. మండల సమాఖ్యను గురువారం వివిధ రాష్ట్రాలకు చెందిన ఎన్‌ఐఆర్డీ ప్రాజెక్టు మేనేజర్లు, జిల్లా మేనేజర్లు సందర్శించారు. మహిళా సంఘాల సభ్యులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మహిళా సంఘాల ఐక్యత, ఆర్థికంగా ఎదిగే విధానం బాగుందని కితాబిచ్చారు. ఇలాంటి కార్యక్రమాలు తమ రాష్ట్రాల్లో ఏర్పాటు చేసుకుంటామని తెలిపారు. అనంతరం ఎంపీడీఓ, ఏపీఎంలతో పాటు అధికారులు సంఘాల పనితీరు గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్‌ఐఆర్డీ మేనేజర్ అభిషేక్, సెర్ప్ ప్రాజెక్టు మేనేజర్లు వీరమల్లు, వెంకట్, మహేశ్వరం ఎంపీడీఓ శైలజ, ఏపీఎం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మహేశ్వరం మండల మహిళా సమాఖ్యను సందర్శించిన ఎన్‌ఐఆర్డీ అధికారులు

సమస్యల వసతి గృహాలు

ప్రభుత్వ వసతి గృహాలను సమస్యలు వెంటాడుతున్నాయి. దెబ్బతిన్న భవనాలు, నీటి వసతి లేకపోవడం, మరుగుదొడ్ల సమస్య.. ఇలా చెప్పుకుంటూ పోతే బోలెడు.. విద్యార్థుల బాధలు ఇటు పాలకులకు, అటు అధికారులకు పట్టడం లేదు. ఇందుకు నిలువెత్తు నిదర్శనం కొడంగల్‌లోని ప్రభుత్వ హాస్టళ్లే..

- హాస్టళ్లలో కనీస వసతులు కరువు
- కూలిన ప్రహరీలు
- కురుస్తున్న గదులు
- పెచ్చులూడుతున్న పైకప్పు



కొడంగల్ బీసీ హాస్టల్‌లో పెచ్చులూడిన పైకప్పు



దుస్థితికి చేరిన మరుగుదొడ్లు

కొడంగల్: పేద విద్యార్థులకు మెరుగైన వసతితో కూడిన విద్యను అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం వసతి గృహాలను ఏర్పాటు చేసింది. మారుమూల గ్రామాలకు చెందిన విద్యార్థులు హాస్టల్‌లో ఉంటూ చదువుకునే వెసులుబాటు కల్పించింది. అయితే గత పాలకుల వసతి గృహాలను పట్టించుకున్న పాపాన పోలేదు. రెసిడెన్సియల్ విద్యకు ప్రాధాన్యత ఇచ్చి వసతి గృహాలను నిర్లక్ష్యం చేశారు. దీంతో పేద విద్యార్థులు తలదాచుకుంటున్న ప్రభుత్వ గృహాల్లో కనీస మౌలిక సదుపాయాలు కరువయ్యాయి. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో సమస్యలు మరింత పెరిగాయి. వాటిని పరిశీలించి పరిష్కరించాల్సిన పాలక వర్గం పట్టించుకోలేదు. దీంతో ప్రభుత్వ హాస్టళ్లలో సమస్యలకు నిలయంగా మారాయి. నియోజకవర్గ కేంద్రమైన కొడంగల్ ప్రభుత్వ వసతి గృహాల్లో సమస్యలు తాండవం చేస్తున్నాయి. సదుపాయాలు లేక గత ఏడాది విద్యార్థులు ఇబ్బంది పడ్డారు. పట్టణంలో బీసీ బాలుర, బాలికలు, ఎస్సీ బాలుర, బాలికలు, ఎస్టీ బాలుర వసతి గృహాలు ఉన్నాయి. బీసీ బాలుర వసతి గృహంలో సుమారు వంద మందికి పైగా విద్యార్థులు ఉంటారు. వీరికి సరిపడా మరుగుదొడ్లు లేవు. హాస్టల్ ప్రహరీ కూడా కూలిపోయింది. నీటి సమస్య ఉంది. భవనం శిథిలావస్థకు చేరింది. చిన్నపాటి వర్షానికే ఉరుస్తోంది. గదుల్లోకి నీరు చేరుతోంది. రాత్రి పడుకోడానికి విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. బోరు మోటారు తరచూ కాలిపోతోంది. ఎప్పుడు పనిచేస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. వసతి గృహంలో నెలకొన్న సమస్యలను జిల్లా అధికారులకు వివరించినట్లు వార్డెన్ రాధిక తెలిపారు. ఈ నెల 12వ తేదీ నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. వర్షాలు కురిస్తే విద్యార్థులు ఉండలేని పరిస్థితి. అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని విద్యార్థులు కోరుతున్నారు.

కొత్త భవనాలకు ప్రతిపాదనలు

పట్టణంలోని ఎస్సీ, బీసీ వసతి గృహాలకు నూతన భవనాలు మంజూరు చేయాలని కడా కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చాం. ప్రభుత్వం స్పందించి నిధులు మంజూరు చేస్తే విద్యార్థులకు మెరుగైన వసతి అందుతుంది. ప్రస్తుతం పాత భవనాలు విద్యార్థులు ఉండటానికి ఏ మాత్రం అనుకూలంగా లేవు.

– హన్మంత్‌రెడ్డి, ఎస్సీ హాస్టల్ వార్డెన్, కొడంగల్

నిలిచిన భూ రిజిస్ట్రేషన్లు

కొందుర్గు: పదిహేను రోజులుగా జిల్లేడ్ చౌదరిగూడ తహసీల్దార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడంతో స్లాట్లు బుక్ చేసుకున్న రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అధికారికి ఆరోగ్యం బాగులేక కొన్ని రోజులు, ఆపరేటర్ లేక కొన్ని రోజులు, తీరా ఇద్దరు విధుల్లో చేరితే ఎన్నికలు.. పరీక్షల విధులంటూ ఇంకొన్ని రోజులు తహసీల్దార్ కార్యాలయం (సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం)లో గత నెల 24 నుంచి ఇప్పటి వరకు భూముల రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. దీంతో ఈ కార్యాలయంలో దాదాపు 200కు పైగా స్లాట్లు బుక్‌చేసి రిజిస్ట్రేషన్లు పెండింగ్‌లో ఉన్నాయి. మే 24కు ముందు ఇక్కడ డిప్యూటీ తహసీల్దార్ హర్షద్ లాగిన్ ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియ సాగేది. అయితే ఆయన కాలుకు గాయం కావడంతో సెలవులో ఉన్నారు. ఈ సందర్భంగా లాగిన్ తహసీల్దార్ జగదీశ్వర్‌కు మార్చాలని వినతి పెట్టారు. లాగిన్ మార్చే లోపే ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న నరేందర్ తన తండ్రి అనారోగ్యానికి గురయ్యారని సెలవుపై వెళ్లారు. ప్రస్తుతం ఆపరేటర్ తిరిగి విధుల్లో చేరగా తహసీల్దార్‌కు ఎన్నికలు, గ్రూప్‌-1 పరీక్షల విధులకు వెళ్లారంటూ రిజిస్ట్రేషన్ల ప్రక్రియ సాగడం లేదు. పదిహేను రోజులుగా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ నిలిచిపోవడంతో రైతులు అవస్థలు పడుతున్నారు. రిజిస్ట్రేషన్ల ప్రక్రియ సజావుగా సాగేలా చూడాలని ప్రజలు కోరారు.

మహిళలు మరింతగా ఎదగాలి



జెండాను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఉజ్వల సృజన, మహిళా కమిటీ సభ్యులు

రాష్ట్ర మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఉజ్వల సృజన

చేవెళ్ల: మహిళలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందాలని భారత ాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఉజ్వల సృజన అన్నారు. భారత జాతీయ హహిళా సమాఖ్య 70 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం మండల కేంద్రంలోని భూపోరాట కేంద్రం సీపీఐ కాలనీ ఫేజ్ -2లో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు వడ్ల మంజుల అధ్యక్షతన వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జెండా ఆవిష్కరించిన అనంతరం ఉజ్వల సృజన మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 76 సంవత్సరాలు అవుతున్నా సమాజంలో సగభాగంగా ఉన్న మహిళలకు పూర్తి హక్కులు, స్వేచ్ఛ, రక్షణలను ప్రభుత్వాలు ఇంకా కల్పించలేకపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలు చైతన్యవంతులు కావాలని అప్పుడే హక్కులు సాధించుకుంటారన్నారు. సీపీఐ అనుబంధంగా ఉన్న భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర వ్యాప్తంగా బలోపేతం కావాలని ఆకాంక్షించారు. జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కె.నీలమ్మ, ప్రధాన కార్యదర్శి ఎండీ ఫైమీద మాట్లాడుతూ.. జిల్లా మహిళా సమాఖ్య బలోపేతానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. మహిళలు ఎక్కడ అన్యాయానికి గురైనా అక్కడ మహిళా సమాఖ్య ముందుంటుందని, న్యాయం కోసం పోరాటం చేస్తుందని తెలిపారు. మహిళలంతా ఐక్యంగా మహిళా సమాఖ్యను బలోపేతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.రామస్వామి, జిల్లా, మండల కమిటీ సభ్యులు కమల, విజయ, రమాదేవి, వెంకటమ్మ, సువర్ణ, అంజమ్మ, రేణుక, జయమ్మ, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బాధితుడికి పరామర్శ



బాధితుడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

బంట్వారం: విద్యుత్ షాక్‌కు గురియై గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కోట్‌పల్లికి చెందిన గౌస్‌ను తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి గురువారం పరామర్శించారు. విషయం తెలియగానే ఆయన నగరంలోని గాంధీ ఆస్పత్రికి వెళ్లి బాధితుడు గౌస్‌ను పలుకరించి ధైర్యం చెప్పారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఎమ్మెల్యే వెంట పెద్దేముల్ జెడ్పీటీసీ ధారాసింగ్ , కోట్‌పల్లి సీనియర్ కాంగ్రెస్ నాయకులు జ్ఞానేశ్వర్, సంగయ్యస్వామి తదితరులు ఉన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న పీడీఎస్ బియ్యం

పరిగి: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్న ఘటన పట్టణ కేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా, కొందుర్గు మండల కేంద్రం నుంచి కర్ణాటకకు బియ్యాన్ని తరలిస్తుండగా పక్కా సమాచారంతో పరిగి పోలీసులు బియ్యాన్ని తరలిస్తున్న డీసీఎంను పట్టుకున్నారు. డీసీఎంను పరిశీలించగా ఎలాంటి అనుమతులు లేకుండా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నట్లు గుర్తించారు. వెంటనే డీసీఎంను పరిగి పోలీస్ స్టేషన్‌కు తరలించి పరిశీలించగా 120 క్వింటాళ్లు ఉన్నట్లు తెలిపారు. రెవెన్యూ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సంతోష్ కుమార్ తెలిపారు.

నీటి సమస్యపై ధర్నా



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

బంట్వారం: తాగునీటి సమస్యపై కోట్‌పల్లి మండలంలోని ఎస్సీకాలనీ మహిళలు గురువారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో ధర్నా చేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ.. గతకొన్ని రోజులుగా కాలనీకి తాగునీరు సరఫరా కావడం లేదన్నారు. మిషన్‌భగీరథ నీరు సైతం సక్రమంగా సరఫరా కావడం లేదని వాపోయారు. చెడిపోయిన బోరును బాగు చేయించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సత్వరమే తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పెండింగ్ పనులు పూర్తి చేయండి



మాట్లాడుతున్న తహసీల్దార్

కొడంగల్ : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో పెండింగ్ పనులను వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్ విజయ్‌కుమార్ ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం రెవెన్యూ ఉద్యోగులతో ఆయన సమావేశం నిర్వహించారు. ధరణి మాడ్యూల్స్, ప్రజావాణి దరఖాస్తులు, మీ సేవా దరఖాస్తులను క్లియర్ చేయాలని చెప్పారు. ఇతర సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరగా పరిష్కరించాలని సూచించారు.

పిడుగుపాటుకు ఆవు మృతి



మృతి చెందిన ఆవును చూపుతున్న రైతు

కేశంపేట: మండల పరిధిలోని చౌలపల్లి గ్రామంలో గురువారం పిడుగుపాటుకు పాడి ఆ వు మత్యువాత పడింది. గ్రామానికి చెంది న వడ్ల శ్రీనివాస్ వ్యవసాయంపైన ఆధారప డి కుటుంబాన్ని పోషిస్తున్నారు. దాదాపు రూ .70 వేల విలువ చేసే ఆవు మృతి చెందడంతో రైతు కుటుంబ పోషణకు ఇబ్బందులు ఎదురవుతాయని, ఆయన్ని ప్రభుత్వమే ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రైతులను దోచుకుంటున్నారు..

- రూ.270 యూరియా బస్తాను రూ.320కి విక్రయం
- ధర అడిగితే బిల్లు లేదు.. కానరాని ధరల పట్టిక
- పట్టించుకోని అధికారులు



ఎరువుల బస్తాలను దించుతున్న కూలీలు (ఫైల్)

పెద్దేముల్: అన్నదాతలను ఎరువుల దుకాణాల యజమానులు దోచుకుంటున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మాత్రమే ఎరువులు, విత్తనాలు అమ్మాలని అధికారులు ఆదేశించినా దుకాణాల యజమానులు ఇష్టం వచ్చిన ధరలకు అమ్ముతున్నారు. బిల్లులు అడిగితే పురుగుల మందులు ఇవ్వరు. ధరల పట్టిక, స్టాక్ బోర్డు కానరాదు. వ్యవసాయ అధికారులు దుకాణాల వద్దకు వచ్చి ప్రతి నిత్యం విక్రయాలు, స్టాక్ రిజిస్టర్లను తనిఖీలు చేయడం తప్ప రైతులకు ఎరువులు, పత్తి విత్తనాలు ఏ ధరకు విక్రయాలు చేస్తున్నారని ఎందుకు అడగడం లేదని రైతులు ప్రశ్నిస్తున్నారు. ప్రతి ఏటా మందులు విక్రయాల సమయంలో అధిక ధరలకు విక్రయాలు చేసి, పంటలు చేతికి వచ్చే సమయంలో పంటలను తుకాల్లో మోసం చేసిన సంబంధిత శాఖ అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు. ఎరువులు గోదాముల్లో స్టాక్ ఉన్నా ఆసాముల పేరుతో నయా దందా మొదలు పెట్టారు. అనుమతి లేని కొన్ని ప్రాంతాల్లో స్టాక్ నిల్వలు చేస్తున్నట్లు సమాచారం. ఈ విషయాన్ని వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినబడుతున్నాయి.

సీజన్‌లో పండుగే పండుగ..

మండలంలోని మంబాపూర్, పెద్దేముల్, గాజీపూర్, కందనెల్లితో పాటు పలు గ్రామాల్లో ఎరువుల దుకాణాలు ఉన్నాయి. విత్తనాలు విత్తే సమయం, ఎరువులు విక్రయాలు చేసే సమయంలో వారికి పండుగే పండుగా. ఎరువులను ఇష్టం వచ్చిన ధరలకు విక్రయాలు చేసిన పట్టించుకునే వారు లేరు. రైతులు గోప్యంగా ఫిర్యాదులు చేస్తే నామ మాత్రంగా తనిఖీలు చేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. ప్రభుత్వం 45 కిలోల యూరియా బస్తాను రూ.270, డీఏపీ రూ.1350 విక్రయం చేయాలని ఆదేశాలున్నా కొంత మంది ఎరువుల దుకాణాలు యజమానులు ట్రాన్స్‌పోర్ట్ ఖర్చుతో యూరియాను రూ.320 నుంచి రూ.330 వరకు విక్రయాలు చేస్తున్నారు. డీఏపీ రూ.1350లకు విక్రయాలు చేయాల్సి ఉండగా రూ.1400నుంచి రూ.1450లకు విక్రయాలు చేస్తున్నారు. బిల్లులు అడిగితే ఎరువులు లేవంటున్నారు. అమాయక రైతులకు చిట్టీలు ఇచ్చి పంపుతున్నారు. ఏఓతో పాటు ఆరు గ్రామాలకు ఏఈఓలను నియమించిన లాభం లేదన్న ఆరోపణలు వినబడుతున్నాయి. దీంతో రైతన్నలకు నష్టాలే మిగులుతున్నాయి.

నామమాత్రంగా కేసులు..

గతంలో కాలం చెల్లిన మందులు దొరికిన వ్యవసాయ అధికారులు నామ మాత్రంగా కేసులు చేసి వారినే రక్షించుకుటున్నారన్న ఆరోపణలు వినబడుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ఏఏ ఎరువుల దుకాణానికి ఎంత మందులు వచ్చాయి. ఏఏ ధరలకు విక్రయాలు చేశారన్న దానిపై విచారణ చేసి వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని మారేపల్లి, జనగాం, నాగులపల్లి, తింసాన్‌పల్లితో పాటు పలు గ్రామాల రైతులు అంటున్నారు.

ఎరువులు అందుబాటులో ఉంచాలి



విత్తనాలు విత్తే సమయంలో మండలంలోని రైతు సేవా సహకార సంఘం ద్వారా ఎరువులు, విత్తనాలు అందుబాటుల్లో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. లేదా అధిక ధరలకు ఖరీదు చేయాల్సి వస్తుంది. తాండూరు నుంచి తీసుకురావాలన్న బస్తాకు రూ.50 నుంచి 60 వరకు అదనంగా ఖర్చు అవుతుంది. ఏటా వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు చేస్తున్నాం. కాని వారు పట్టించుకోవడం లేదు.

–వెంకటేశం రైతు జనగాం

లైసెన్స్‌లు రద్దు చేయాలి



ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే ఎక్కువ ధరలకు ఎరువులు, మందులు విక్రయాలు చేస్తే దుకాణాల యజమానులపై చర్యలు తీసుకోవడంతో పాటు లైసెన్స్‌లు రద్దు చేయాలి. ప్రతి ఏటా అధిక ధరలకు విక్రయాలు చేస్తున్నారని ఫిర్యాదు చేస్తున్న వ్యవసాయ అధికారులు పట్టించుకోవడం లేదు.

– రాంరెడ్డి రైతు గిర్మాపూర్

తప్పకుండా చర్యలు



రైతులు తప్పకుండా బిల్లులు తీసుకోవాలి. ఎరువులు, మందులకు అధిక ధరలకు విక్రయాలు చేసినట్లు ఫిర్యాదు చేస్తే వారిపై తప్పకుండా చర్యలు తీసుకుంటాం. అవసరం అయితే ఉన్నతాధికారులతో విచారణ చేయిస్తాం. ధరల పట్టిక తప్పకుండా చూయించాలి. అనుమతి లేకుండా ఎరువులు స్టాక్ చేస్తే ఎరువులను సీజ్ చేస్తాం. అధిక ధరలకు ఎరువులు, విత్తనాలు చేసినట్లు రాత పూర్వకంగా రుజువు చేస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటాం. అవసరం అయితే వారి లైసెన్స్ రద్దుతో పాటు పోలీస్ కేసులు పెడతాం.

– నజీరొద్దీన్ ఏఓ, పెద్దేముల్

అయ్యో పాపం.. ఆరేళ్ల బాలిక!

- సాయంత్రం ఆచూకీ గల్లంతు
- రాత్రి తొమ్మిది గంటలకు చెట్ల పొదల్లో లభ్యం
- క్షుద్రపూజలకా.. అఘాయిత్యానికా ?



అంజిలయ్యను పట్టుకున్న గ్రామస్తులు

బొంరాస్‌పేట: బహిర్భూమికి వెళ్లిన చిన్నారిని బుజ్జగించి పొదల్లోకి తీసుకెళ్లాడో వ్యక్తి. ఊరంతా చిన్నారి ఆచూకీ కోసం వెతకగా రాత్రి ఊరిబయటి పొలాల్లోని పొదల్లో అదే గ్రామానికి చెందిన ఓవ్యక్తి వద్ద కనిపించింది. ఇంతకీ చిన్నారిని క్షుద్రపూజలకా? అత్యాచారానికా? అనేది అంతుచిక్కడం లేదు. ఈసంఘటన బొంరాస్‌పేట మండల పరిధిలోని రేగడిమైలారంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామస్తులు వివరాల మేరకు.. గ్రామానికి చెందిన ముసులగళ్ల రమేశ్, జయశ్రీలకు కూతురు (6), కుమారుడు (18నెలలు) ఉన్నారు. రమేశ్ హైదరాబాద్‌లో కొంతకాలంగా బైక్ మెకానిక్‌గా ఉంటున్నాడు. భార్య అనారోగ్యంతో ఉండగా ఇంటి వద్ద ఉంటోంది. ఆరేళ్ల వయసున్న కూతురు గురువారం సాయంత్రం జాతీయ రహదారిపైకి వచ్చింది. అంతలో అదేగ్రామానికి చెందిన కడంపల్లి అంజిలయ్య(40) తన పొలానికి వెళ్తున్నాడు. బహిర్భూమికి వెళ్లిన చిన్నారి రాత్రి వరకు ఇంటికి రాకపోవడంతో కాలనీవాసులు, యువకులు వెతకసాగారు. ఊరి బయటి పొలాల్లోని చెట్ల పొదల్లో కడంపల్లి అంజిలయ్య వద్ద ఉండటంతో పట్టుకున్నారు. ఇంకొందరు పారిపోయినట్లు అనుమానిస్తున్నారు. పట్టుకున్న అంజిలయ్యను ఆరా తీయగా సరైన సమాధానాలు చెప్పకపోవడంతో పోలీసులకు సమాచారం అందించి అప్పగించారు. ఇంతకీ ఈ పసికందును కిడ్నాప్ చేసింది క్షుద్రపూజలకా? పసికందు అత్యాచారానికా? అనేది తెలియడంలేదు. శుక్రవారం విచారించి అసలు విషయాలు బయటపెడతామని పోలీసులు చెబుతున్నారు.

గేట్ వేశాక దాటొద్దు

ఆర్‌పీఎఫ్ సీఐ రాజేంద్రప్రసాద్

అనంతగిరి: రైల్వే గేట్లు వేసిన తరువాత వాటి కింద నుంచి దాటేందుకు పాదాచారులు, వాహనదారులు ప్రయత్నించొద్దని ఆర్‌పీఎఫ్ సీఐ రాజేంద్రప్రసాద్ సూచించారు. గురువారం అంతర్జాతీయ లెవెల్ క్రాసింగ్ అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకుని వికారాబాద్‌లోని రైల్వే గేట్ల వద్ద ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ పోలీసుల ఆధ్వర్యంలో వాహనదారులు, పాదాచారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రమాదమని తెలిసిన ప్రజలు దాటడం సరికాదన్నారు. గేటు వేసినప్పటి నుంచి రైలు వెళ్లిపోయాక గేట్ లేపేవరకు(తీసే వరకు) అక్కడే ఆగాలన్నారు. గేట్ కింది నుంచి వెళ్లేందుకు యత్నించి ప్రమాదాల బారిన పడవద్దని చెప్పారు. రైలు వెళ్లి పోయినప్పటికీ సాంకేతికత వల్ల 30–40 సెకన్ల వరకు గేట్ తీసే అవకాశం ఉండదు. కానీ, రైలువెళ్లి పోగానే గేట్ తీసే వరకు హారన్లు కొడుతూ, శబ్ద కాలుష్యం వాహనదారులు సృష్టించడం మంచిదన్నారు. కార్యక్రమంలో జీఆర్‌పీ ఎస్ఐ శంకరయ్య, పలువురు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న రాజేంద్రప్రసాద్

విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దు

శంకర్‌పల్లి: అధికారులు తమ విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దని శంకర్‌పల్లి ఎంపీడీఓ వెంకయ్య అన్నారు. గురువారం మండలంలోని పిల్లిగుండ్ల గ్రామంలో బడిబాట కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ.. ఈ నెల 19వరకు జరిగే ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలన్నారు. గ్రామంలో ఖాళీగా, పనులకు వెళ్లే చిన్నారులను గుర్తించి వెంటనే వారిని పాఠశాలల్లో చేర్పించేందుకు కృషి చేయాలన్నారు. అదే విధంగా విద్యా ప్రాముఖ్యతపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి మౌలిక సదుపాయాల మరమ్మతులు పూర్తి కావాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రమీల, హెచ్‌ఎం బాలమణి తదితరులు ఉన్నారు.

పీసీసీ జీఎస్‌కు అభినందనలు



సీఎంతో మాట్లాడుతున్న రఘువీరారెడ్డి

ధారూరు: పీసీసీ ప్రధాన కార్యదర్శి పటోళ్ల రఘువీరారెడ్డిని గురువారం సీఎం రేవంత్‌రెడ్డి అభినందించారు. నాగర్‌కర్నూల్ లోకసభ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి మల్లురవి విజయం సాధించడంపై రఘువీరారెడ్డి హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. గద్వాల అసెంబ్లీ నియోజకవర్గం కోఆర్డినేటర్‌గా పనిచేసి మల్లురవి గెలుపునకు కృషి చేసిన పీసీసీ ప్రధాన కార్యదర్శి రఘువీరారెడ్డిని సీఎం అభినందించారు. కాంగ్రెస్ పార్టీ తరఫున ప్రచారం చేసిన తాను కార్యకర్తలు, నాయకులు కలిసి వారిలో ఉత్తేజాన్ని నింపడంతో పాటు కలిసికట్టుగా పనిచేసి అభ్యర్థి విజయానికి దోహదపడ్డారని ఈ సందర్భంగా సీఎంకు వివరించారు.

కరెంట్ షాక్‌తో మహిళ మృతి



ఈశ్వరమ్మ(ఫైల్)

యాలాల: బట్టలను ఇస్త్రీ చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై ఓ మహిళ మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని రాస్నం గ్రామంలో గురువారం జరిగింది. బాధిత కుటుంబ సభ్యులు వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చాకలి ఈశ్వరమ్మ(45), వెంకటయ్య దంపతులు గ్రామంలోని బస్టాండ్ సమీపంలో ఇస్త్రీ డబ్బా పెట్టుకొని జీవనం సాగిస్తున్నారు. ఎప్పటిలాగే గురువారం బట్టలు ఇస్త్రీ చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై ఈశ్వరమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. ఈశ్వరమ్మ కుటుంబానికి ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు. మృతురాలికి భర్తతో పాటు ఇద్దరు కూతుళ్లున్నారు.

నేడు మండల సమావేశం

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ యాదమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరవుతారని, మండల స్థాయి అన్ని శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలతో సమయానికి రావాలని సూచించారు. అన్ని గ్రామాల ఎంపీటీసీలు సమావేశానికి హాజరుకావాలని కోరారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు: ఏఓ



రికార్డులను పరిశీలిస్తున్న ఏఓ సురేశ్‌బాబు, పోలీసులు

శంకర్‌పల్లి: దుకాణ యజమానులు నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి సురేశ్‌బాబు అన్నారు. గురువారం పట్టణంలోని పలు దుకాణాల్లో పోలీసులతో కలిసి ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విత్తనాలను అమ్మాలని, అధిక ధరలకు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. లూజ్ విత్తనాలు అమ్మితే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. దుకాణదారులు విత్తనాల వివరాలను రికార్డుల్లో నమోదు చేయాలని, సీడ్ స్టాక్ రిజిస్టర్, గ్రౌండ్ స్టాక్, బిల్‌బుక్‌లను ఖచ్చితంగా మెయింటెన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

ప్రతిపాదనను స్వీకరించాలి



తహసీల్దార్ రమేశ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కొందుర్గు: రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రాజముద్ర తయారీ తమ ప్రతిపాదనను స్వీకరించాలని డీఎస్పీ నాయకులు గురువారం కొందుర్గు తహసీల్దార్ రమేశ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం చిహ్నం మార్పు చేసే విషయాన్ని తాము స్వాగతిస్తున్నామని, చిహ్నంలో ఉస్మానియా యూనివర్సిటీ, బీఆర్ అంబేడ్కర్, పండుగ సాయన్న, సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్, సమ్మక్క, సారలమ్మ చిత్రాలు వచ్చేలా పొందించాలని కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ రవీందర్, నాయకులు రాములు, పెటయ్య, గోపాల్, నవీన్ పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయంలో పూజలు




ఆలయంలో పూజలు చేస్తున్న చంద్రశేఖర్, కార్తీక్

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలోని సాయిబాబా ఆలయంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు కొండ చంద్రశేఖర్ దంపతుల సహకారంతో డాక్టర్ కొండ కార్తీక్ దంపతులు గురువారం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయంలో సాయిబాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీగా బీఆర్‌ఎస్ నాయకుడు నవీన్‌కుమార్‌రెడ్డి గెలుపొందిన సందర్భంగా సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను చేశామని వారు తెలిపారు. భవిష్యత్‌లో బీఆర్‌ఎస్ పార్టీ పేదలకు అండగా ఉంటుందని, అన్ని వర్గాల ప్రజల సహకారంతో ముందుకు సాగుతుందన్నారు.

వెలగనున్న గృహజ్యోతి

- ఎన్నికల కోడ్ ముగియడంతో 200 యూనిట్లలోపు వారికి ఉచిత విద్యుత్
- జిల్లాలో 11.50 లక్షల మందికి చేకూరనున్న లబ్ధి



సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఎన్నికల కోడ్ ముగిసింది. గృహజ్యోతి పథకాన్ని అధికారులు ఉమ్మడి జిల్లా పరిధిలోని 200 యూనిట్లలోపు వినియోగదారులకు జూన్ నుంచి వర్తింపజేయనున్నారు. సార్వత్రిక ఎన్నికలు రావడంతో ఈ పథకం ఇప్పటి వరకు జిల్లాలో అమలు కాలేదు. సరూర్‌నగర్, రాజేంద్రనగర్, సైబర్‌సిటీ, వికారాబాద్ సెక్షన్ల పరిధిలో నెలకు 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించే వారు 11.50 లక్షల మంది వరకు ఉన్నట్లు అంచనా. ఆహార భద్రత కార్డులు ఉన్న వారు ఈ పథకానికి ఇప్పటికే దరఖాస్తు చేసుకున్నారు. వీరందరికీ ఈ నెల నుంచి జీరో బిల్లులు చేతికందనున్నాయి. గ్రేటర్‌లోని హైదరాబాద్‌లో ఇప్పటికే 10 లక్షల మందికి పైగా ఈ పథకం కింద లబ్ధి పొందుతుండగా, తాజాగా ఎన్నికల కోడ్ ముగియడంతో జిల్లాలోని మరికొంత మందికి ఈ పథకం కింద లబ్ధి చేకూరనుంది. ఇప్పటికే మీటర్ రీడింగ్ నమోదు, బిల్లుల జారీ ప్రక్రియ కూడా మొదలైంది.

చల్లబడిన నగరం.. తగ్గిన వినియోగం

మే మూడో వారం వరకు భగ్గున మండిన ఎండలు ..చివరి వారంలో తగ్గుముఖం పట్టాయి. గత నాలుగు రోజులుగా పలు చోట వర్షం కురుస్తూనే ఉంది. ఫలితంగా వాతావరణం చల్లబడింది. నిన్నమొన్నటి వరకు రోజంతా పని చేసిన ఏసీలు, కూలర్లు ప్రస్తుతం ఆఫ్ చేశారు. దీంతో కరెంట్ వినియోగం తగ్గింది. మే 31న 4,115 మెగావాట్లు డిమాండ్ ఉండగా, 87.03 ఎంయూల వినియోగం నమోదైంది. జూన్ 1న 4046 మెగావాట్లు నమోదైంది. తాజాగా గురువారం 71 ఎంయూలకు పడిపోయింది.

కబేళాకు తరలిస్తున్న పశువుల పట్టివేత



డీసీఎంలో తరలిస్తున్న పశువులు

యాచారం: సాగర్‌రోడ్డుపై అక్రమంగా తరలిస్తున్న ఆవులను పోలీసులు పట్టుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. నల్గొండ జిల్లా కొండమల్లెపల్లి సంత నుంచి గురువారం ఇద్దరు వ్యక్తులు 14 పశువులను నగరంలోని కబేళాకు తరలిస్తున్నారు. మార్గమధ్యలో యాచారం పీఎస్ పరిధిలోని మాల్ చెక్‌పోస్టు వద్ద పోలీసుల తనిఖీలు చేయగా డీసీఎంలో పశువులున్నట్లు గుర్తించారు. ఆధారాలు లేకపోవడంతో పశువులను నగరంలోని గోశాలకు తరలించారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

లక్ష్యం కన్నా.. సంరక్షణ మిన్న

- హరితహారానికి ముమ్మర ఏర్పాట్లు
- నర్సరీల్లో సిద్ధంగా ఉన్న మొక్కలు
- మండలంలో 1.30లక్షల నాటడమే లక్ష్యం
- వానలు పడగానే ప్రారంభించాలన్న యోచన



కక్కులూర్ నర్సరీలో సిద్ధంగా ఉన్న మొక్కలు

షాబాద్: వర్షాకాలంలో మొక్కలు నాటేందుకు ప్రణాళికలు రూపొందించారు. 10వ విడత హరితహారం కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రణాళికలు ముమ్మరం చేస్తున్నారు. అయితే ఈసారి భారీ లక్ష్యాన్ని నిర్దేశించకుండా నాటిన మొక్కలన్నింటినీ సంరక్షించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. గతంలో హరితహారంలో నాటిన మొక్కలు కొన్నిచోట్ల ఏపుగా పెరిగాయి. మరికొన్ని గ్రామాల్లో నాటిన ఆనవాలు లేకుండా పోయాయి. ప్రత్యేక శ్రద్ధ తీసుకున్న చోట మొక్కలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో మొక్కల సంరక్షణకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులు నిర్ణయించారు. గతంలో ఆదేశించినట్లుగా కాకుండా లక్ష్యాన్ని సగానికి తగ్గించారు. నాటిన మొక్కలను బతికించాలన్న సంకల్పంతో ముందుకు సాగుతున్నారు. హరితహారం కార్యక్రమం ఈ నెలలో ప్రారంభం కానుంది. ప్రతి పంచాయతీకి 3 వేల చొప్పున మొక్కలు నాటాలన్నా లక్ష్యం ఉంది. ఈసారి మండలంలో 1 లక్ష 30 వేల టార్గెట్ విధించారు.

గ్రామానికి ఒక నర్సరీ..

మండలంలో 41 పంచాయతీలకు గాను అన్ని గ్రామాల్లోనూ నర్సరీలను ఏర్పాటు చేశారు. నర్సరీల బాధ్యత గ్రామ పంచాయతీలకు అప్పగించారు. ఎప్పటికప్పుడూ కార్యదర్శులు నర్సరీలను పర్యవేక్షిస్తూ మొక్కలను సంరక్షిస్తున్నారు. నర్సరీలో సుమారుగా 20 రకాల పండ్ల, పూల మొక్కలతో పాటు ఇతర మొక్కలను పెంచుతున్నారు. మొక్కలకు జియో ట్యాంగింగ్ చేస్తున్నారు. ఈ సారి నాటే ప్రతి మొక్క పెరిగేందుకు ఇటు అధికార యంత్రాంగం, అటు ప్రజాప్రతినిధులు, ప్రజల చొరవ తీసుకుంటే ఆశించిన లక్ష్యం నెరవేరుతుంది. మొక్కలు నాటడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

అందరూ భాగస్వాములు కావాలి



10వ విడత హరిహారం కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందించాం. అన్ని శాఖల పరిధిలో మొక్కలు నాటేందుకు సిద్ధం చేశాం. జూన్‌లో మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభమవుతోంది. ప్రజాప్రతినిధులతో పాటు ప్రజల సహకారం పూర్తిస్థాయిలో అవసరం. అందరూ భాగస్వాములు అయితేనే లక్ష్యాన్ని చేరగలుగుతాం.

–అపర్ణ, ఎంపీడీఓ, షాబాద్